మర్రిగూడ ప్రభుత్వ పాఠశాలలో బేటీ బచాఓ-బేటీ పడాఓ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ నిర్మల

బాల్య వివాహాలను నిర్మూలించాలి

● సీడీపీఓ నిర్మల

నీలగిరి, డిసెంబర్ 15 : సమాజంలో నేటికి జరుగుతున్న బాల్య వివాహాలు, బ్రుణ హత్యల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నల్లగొండ సీడీపీఓ తూముల నిర్మల అన్నారు. శుక్రవారం మర్రిగూడ లోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన బేటీ బచావో-బేటి పడావో అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి మహిళ రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో ముందుండాలని అందుకు ప్రధాన ఆయుధం చదువేనన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు నిర్మూలించేందుకు 18 సంవత్సరాల లోపు బాలికల వివరాలు ప్రతీ అంగన్‌వాడీ నమోదు చేసుకుని పర్యవేక్షిస్తుండాలని సూచించారు. బ్రుణ హత్యల నివారణకు మహిళలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు స్వర్ణలత, శంకరమ్మ, ఉషశ్రీ, పోషణ్ అభియాన్ సిబ్బంది కవిత పాల్గొన్నారు.

అవార్డు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ ఆకుల రవి

ఎంజీయూ అసోసియేట్ ప్రొఫెసర్‌కు జాతీయ అవార్డు

రామగిరి, డిసెంబర్ 15 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆకుల రవికి ఫెలో ఆఫ్ ఇండియన్ కామర్స్ అసోసియేషన్-2023 అవార్డు లభించింది. కామర్స్ విద్యా వ్యాప్తికి చేసిన కృషికి గాను ఆయనకు ఈ అవార్డు దక్కింది. ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో ఇండియన్ కామర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డబ్ల్యూ.కె.సార్‌వాడే చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. అవార్డు రావడంపై ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ సీహెచ్.గోపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి, సహచర అధ్యాపకులు రవికి అభినందనలు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీఎస్ ఎమ్మార్పీఎస్ నేతలు

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

నల్లగొండ, డిసెంబర్ 15 : బీజేపీ మెడలు వంచి ఎస్సీ వర్గీకరణ సాధించే దిశగా మాదిగలంతా సిద్ధపడాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మారపాక నరేందర్‌మాదిగ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ సాధనకై ఈ నెల 21న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో టీఎస్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే మహాధర్నాకు మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనూ ఎస్సీ వర్గీకరణ అంశాన్ని దాటవేసినందున ప్రధాని మోదీ విధానాన్ని వ్యతిరేకిస్తూ ప్రతి ఒక్కరూ ఉద్యమానికి సిద్ధం కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శులు నక్క కృష్ణ, దుబ్బ దేవేందర్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు కందుల సూర్యనారాయణ, రాజు, చరణ్, శ్రీకాంత్, రాజేశ్, తరుణ్ పాల్గొన్నారు.

ఎంజీయూలో హోరాహోరీగా క్రీడా పోటీలు

క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రామగిరి, డిసెంబర్ 15 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో శుక్రవారం హాకీ, హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు తరలివచ్చి హోరాహోరీగా తలపడంతో క్రీడా సందడి నెలకొన్నది. ఈ సందర్భంగా స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని వర్సిటీ జట్టుకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ బోర్డు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మురళీ, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్జీ కళాశాల పీడీ కడారి మల్లేశ్, వివిధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏడుకొండలు

స్వీయ అవగాహనతో పోటీ పరీక్షల్లో విజయం

● మిషన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఏడుకొండలు

రామగిరి, డిసెంబర్ 15 : స్వీయ అవగాహన, ప్రత్యేక ప్రణాళికతో చదివితే పోటీ పరీక్షల్లో విజయం సాధించడం ఖాయమని మిషన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఎక్సైజ్ శాఖ సీఐ ఏడుకొండులు అన్నారు. నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన 'కెరీర్ డెవలప్‌మెంట్ అండ్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్' అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని ఆ దిశగా సాధన చేస్తే యూనివర్సిటీ పట్టాతో పాటుగా ఉద్యోగం సైతం సాధించవచ్చని తెలిపారు. ఎంజీయూ కాంపిటీటీవ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ దోమల రమేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో వర్సిటీ ఫిజిక్స్, కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ చిల్కురి రమేశ్, డాక్టర్ భిక్షమయ్య, జ్యోతి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మంగళపల్లి పాఠశాల విద్యార్థులు

నకిరేకల్, డిసెంబర్ 15 : మండలంలోని మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరూ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 10 వరకు ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించిన పోటీల్లో అండర్-14 విభాగంలో పాఠశాల విద్యార్థులు టి. శివాని (9వ తరగతి), జి.శివ (8వ తరగతి) ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కర్ర వీరారెడ్డి, పీఈటీ చింతకాయల పుల్లయ్య తెలిపారు. విద్యార్థులు ఈ 16 నుంచి 20 వరకు ఢిల్లీలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవీగంగాధర్‌రావు, గ్రామ సర్పంచ్ ప్రగడపు నవీన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నీలగిరి, డిసెంబర్ 15 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా పానగల్ చెరువు వద్ద గురువారం రాత్రి జరిగింది. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరెంట్ల గ్రామానికి చెందిన సంఘని ఉమేశ్‌వర్మ (28) ఓజో అగ్రికేర్‌లో ఏరియా సేల్స్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. కంపెనీ పనిపై గురువారం కారులో నల్లగొండకు వచ్చాడు. పనులు ముగించుకుని రాత్రి సమయంలో తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో పానగల్ చెరువు వద్దకు రాగానే రోడ్డుపై ఆగిఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. దాంతో కారు నుజ్జునుజ్జు అవగా ఉమేశ్‌వర్మ అక్కడికక్కడే మృతిచెందాడు. ఉమేశ్‌కు భార్య, ఏడాది వయస్సు ఉన్న కుమారుడు ఉన్నారు. ఉమేశ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజు తెలిపారు.

ఇంట్లో చోరీ

నీలగిరి, డిసెంబర్ 15 : పట్టపగలు ఇంట్లోకి దూరి సుమారు రూ.లక్ష నగదును అపహరించుకుపోయిన ఘటన నల్లగొండ మండలం దోమలపల్లిలో శుక్రవారం జరిగింది. రూరల్ ఎస్ఐ కంచర్ల భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దోమలపల్లి గ్రామానికి చెందిన కాసాని పాపయ్య నల్లగొండలో ఉంటూ తన గ్రామంలో గౌడ కులస్తుల గుడి నిర్మాణం కోసం విరాళాలు సేకరిస్తున్నాడు. వచ్చిన డబ్బులను గ్రామంలోని తన తల్లి మణెమ్మ వద్ద భద్రపరిచాడు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో మణెమ్మ తన మరో కుమారుడి ఇంటికి వెళ్లి వచ్చి చూడగా తలుపు తాళం పగులగొట్టి ఉండడంతో పాటు బీరువా కూడా తెరిచి ఉన్నది. పరిశీలించగా అందులోని నగదు మాయమైంది. విషయాన్ని కొడుకుకు తెలుపగా అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్లూస్ టీమ్ సంఘటనా స్థలంలో వేలి ముద్రలను సేకరించింది.

నేడు బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

కట్టంగూర్, డిసెంబర్ 15 : మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అధ్యక్షతన శనివారం నకిరేకల్ సువర్ణ గార్డెన్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు జడ్పీటీసీ తరాల బలరాములు, పార్టీ మండలాధ్యక్షుడు ఊట్కూరి ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేసేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పార్టీ బాధ్యులు, ముఖ్య కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఆర్థిక సాయం

కేతేపల్లి, డిసెంబర్ 15 : మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన నారగోని జానయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రమే కావడంతో తనతో పాటు కేతేపల్లి జడ్పీహెచ్ఎస్‌లో చదువుకున్న 2003 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు పలువురు శుక్రవారం రూ.16 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బచ్చు జానకీరాములు పాల్గొన్నారు.

రెడ్డికాలనీలో అనక సత్తిరెడ్డి మెమోరియల్ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న పుష్పమ్మ

ఊరందరికీ ఉచితంగా ఫంక్షన్ హాల్

నల్లగొండ రూరల్, డిసెంబర్ 15 : ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా గ్రామంలో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు అనక విజయ్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. తన తండ్రి జ్ఞాపకార్థం గ్రామంలో నిర్మించిన అనక సత్తిరెడ్డి మెమోరియల్ ఫంక్షన్ హాల్‌ను శుక్రవారం తన సతీమణి సజని, తల్లి పుష్పమ్మ, గ్రామ సర్పంచ్ ఎలుక శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. గ్రామ ప్రజల సౌకర్యార్థం రూ.20 లక్షలతో ఫంక్షన్ హాల్ నిర్మించినట్లు చెప్పారు. ఫంక్షన్ హాల్ గ్రామ పంచాయతీకే చెందుతుందని తెలిపారు. భవిష్యత్‌లోనూ గ్రామ అభివృద్ధికి తమ సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్తిరెడ్డి ఆత్మీయ మిత్రులు ఎంవీ గోనారెడ్డి, మోదుగు రంగారెడ్డి, దామోదర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సులోచన పాల్గొన్నారు.

వరల్డ్ స్కిల్ కాంపిటీషన్ రిజిస్ట్రేషన్‌కు 20 వరకు గడువు

నల్లగొండ రూరల్, డిసెంబర్ 15 : వరల్డ్ స్కిల్ కాంపిటీషన్‌లో పాల్గొనేందుకు ఈ నెల 20 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎన్.పద్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరల్డ్ స్కిల్ కాంపిటీషన్-2024 ఫ్రాన్స్‌లో నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ పోటీలు జిల్లా, రాష్ట్ర, ఫ్రీ నేషనల్, నేషనల్, ఇంటర్నేషనల్ స్థాయిలో నిర్వహించబడుతాయన్నారు. అర్హులైన అభ్యర్థులు దాదాపు 50కి పైగా నైపుణ్యాల్లో పోటీ పడవచ్చన్నారు. ఆటో బాడీ రిపేర్, ఆటో మొబైల్ టెక్నాలజీ, బేకరి, బ్యూటీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఫర్ బిజినెస్ జాయినరీ మొదలైన అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు స్కిల్ ఇండియా డిజిటల్ www.skillindiadigital.gov.in అనే వెబ్‌సైట్‌కు లాగిన్ అయి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

హామీలను అమలు చేయాలి

నకిరేకల్, డిసెంబర్ 15 : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి యాల శ్రీను శుక్రవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను జాప్యం లేకుండా అమలు చేయాలని పేర్కొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు M/s. Shriram Finance Ltd., Tirumalagiri Branch వారు ఇచ్చిన బొగోట్టు ప్రకారం యావన్మందికి తెలుపునది ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్థి రిజిస్ట్రార్ తనఖా చేయించుకొని, శ్రీ/శ్రీమతి వడకొండ దుర్గయ్య, తండ్రి: గోపాలు గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకోన్నాము. కావున సదరు వ్యవహారముకు సంబంధించి, సదరు షెడ్యూలు స్థిరాస్థిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు, చార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్సు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నాటి నుండి (7) ఏడు దినములలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నాక్లయింటు బాధ్యులు కాదు.

SCHEDULE OF THE PROPERTY

నల్లగొండ జిల్లా రిజిస్టారు వారి ఆజమాయిషీలో గల నకిరేకల్ సబ్-రిజిస్టారు కార్యాలయ పరిధిలో చేరిన జిల్లా ప్రజా పరిషత్ నల్లగొండ, మండల ప్రజాపరిషత్ శాలిగౌరారము, గ్రామ పంచాయితి శాలిగౌరారము, శాలిగౌరారము రెవిన్యూ గ్రామములో సర్వే నెం. 757/11, నేచర్: ఖుష్కి, విస్తీర్ణము: య.గు.లు 0-03 1/2, హెక్టార్లు: 0-03 1/2, హద్దులు: ఉత్తరము: వడ్డకొండ దుర్గయ్య వ్యవసాయభూమి, దక్షిణము: గార్లపాటి హనుమంతరావు వ్యవసాయభూమి, తూర్పు: నూతి సుగుణ వ్యవసాయ భూమి, పడమర: రాములవారి గుడి రోడ్డు.

Sd/- **NALLELLA SURENDER, NALLELLA SUHAS**
ADVOCATES, H.No. 1-8-489, Haritha Residency, Balasamudram, HNK, Warangal. Cell: 9849365117

హెచ్చరిక

ఇందుమూలంగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నాక్లయింటు అయిన తౌడోజు చంద్రయ్య తండ్రి: లేట్ బ్రహ్మయ్య, నివాసం: ఇంటి నెం. 8-1-156, గొల్లగూడ, నల్లగొండ పట్టణము మరియు జిల్లా గారు శ్రీమతి తౌడోజు పూలమ్మ భర్త: లేట్ ఈశ్వరయ్య, నివాసం: ఇంటి నెం. 8-3, పెద్దబండ, నల్లగొండ పట్టణము మరియు జిల్లా గారిపైన సర్వే నెం. 541,ఇంటి నెం. 8-1-156లోగల 50 గజాలు మరియు సర్వే నెం. 206లో 0.2 1/2 గుంటలు గల ఇంటి జాగ పైన నల్లగొండ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో సివిల్ దావా వేసియున్నారు. అట్టి సివిల్ దావా పెండింగ్‌లో ఉన్నది. దావా నెంబర్ 884/2022 అయినను సదరు పూలమ్మ గారు ఇతరులకు పైన చూపిన ఆస్తులను దురుద్దేశపూర్వకంగా మోసపూరితంగా **ఇంటినెం.8-1-157** అని తప్పుడు కాగితాలు సృష్టించి ఇతరులకు అమ్మి మోసపుత్నున్నారని నా క్లయింట్‌కు తెలియచ్చినది. కావున ఈ ప్రకటన వెలువడిన తదుపరి ఈ దిగువ చూపిన ఆస్తులను ఎవ్వరు క్రయ విక్రయాలు జరుపరాదని మరియు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని సమస్త ప్రజానీకానికి తెలియపరుచుచున్నాము. ప్రభుత్వ సంస్థలు కాని, ప్రభుత్వేతర సంస్థలు కాని ఇట్టి ఆస్తులపైన ఎలాంటి ఋణాలు మంజూరు చేయరాదని కోరనైనది. ఇట్టి ప్రకటన వెలువడిన నుండి ఇట్టి ఆస్తులపైన ఎవరైన ఎలాంటి క్రయ, విక్రయాలు, నిర్మాణాలు మరియు ఋణాలు ఇవ్వటం కాని జరుపరాదని, ఇట్టి ప్రకటనను అతిక్రమించి ఎవరైనా ఏదేని లావాదేవీలు జరిపినచో వారిపైన చట్టరపైన చర్యలు తీసుకొనబడును. అని హెచ్చరించనైనది.

షెడ్యూలు ఆస్తుల వివరములు

1. సర్వే నం. 541, ఇంటి నెం. 8-1-156లో 50 గజాలు గొల్లగూడ, నల్లగొండ పట్టణం. **హద్దులు:** ఉత్తరం: 20 ఫీట్ల రోడ్, దక్షిణం: పూలమ్మ ఇల్లు, తూర్పు: చంద్రయ్య ఇల్లు, పడమర: పూలమ్మ ఇల్లు, 2. సర్వే నం. 206 విస్తీర్ణం 0.2 1/2 గుంటల ఇంటి స్థాలు పెద్దబండ, గొల్లగూడ, నల్లగొండ పట్టణం. **హద్దులు:** ఉత్తరం: 20 ఫీట్ల రోడ్, దక్షిణం: 80 ఫీట్ల రోడ్, తూర్పు: తౌడోజు వెంకన్న ఇల్లు, పడమర: పూలమ్మ ఇల్లు

ఇట్లు :
యస్. వెంకటరమణస్వామి, అడ్వకేట్
ఇంటి నెం. 8-1-641/1ఏ
పద్మావతి కాలనీ, నల్లగొండ